నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 ఖమ్మం, మంగళవారం 3 సెప్టెంబర్ 2024 KHAMMAM



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

## ముమ్మాటికీ ఇది ప్రభుత్వ వైఫల్యమే..

- ముగ్గురు మంత్రులున్నా ముంపు బాధితులను ఆదుకోలేదు
- 'మున్నేరు'పై ముందు జాగ్రత్త లేకపోవడం వల్లే ఇంతటి నష్టం
- వరదల కారణంగా చనిపోయిన వారికి రూ.25 లక్షలు ఇవ్వాలి
- ప్రతి ఇంటికీ రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలి
- ప్రజలకు ఎల్లప్పుడూ బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అజయ్, ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. జిల్లాకు ముగ్గురు మంత్రులుండి కూడా ముంపు బాధితులను ఆదుకోలేకపోయారని దుయ్యబట్టారు. మున్నేరు వరదలపై ప్రభుత్వానికి ముందు జాగ్రత్త లేకపోవడం వల్లనే ఇంతటి నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తొలుత అజయ్‌కుమార్ మాట్లాడారు. మున్నేరు వరద సహాయక చర్యల్లోనూ, ప్రజలను ముందుగా అప్రమత్తం చేయడంలోనూ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఎంతో అప్రమత్తంగా ఉండేవాళ్లమని గుర్తుచేశారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కనీసం మంచినీళ్లు ఇచ్చేవారు కూడా లేకపోవడం దారుణమని అన్నారు. వరదల్లో మృతిచెందిన వ్యక్తుల కుటుంబానికి ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని, ప్రతి కుటుంబానికీ రూ.2 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 'ఖమ్మం ప్రజలు ధైర్యంగా ఉండాలి. మీ తరుపున బీఆర్‌ఎస్ పోరాడుతుంది' అని భరోసా ఇచ్చారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. ముంపునకు గురైన ప్రాంతాల్లో ఇళ్లన్నీ బురదతో నిండి ఉన్నాయని, పాములు సంచరిస్తున్నాయని అన్నారు. సర్వస్వం కోల్పోయి రోడ్డున పడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరద కారణంగా ప్రాణాలు కోల్పోయిన తొమ్మిది మందికి తమ పార్టీ తరపున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సహాయంగా రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, నిత్యావసర వస్తువులు అందజేయాలని డిమాండ్ చేశారు. సహాయక చర్యల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు చురుగ్గా పని చేస్తున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ వరద నష్ట నివారణలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రరెడ్డి, బొమ్మెర రామ్మూర్తి, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, తోట వీరభద్రం, నాగండ్ల కోటేశ్వరరావు, రోజ్‌లీనా, జ్యోతిరెడ్డి, కూరాకుల వలరాజు, దేశభక్తిని కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మంలో మున్నేరు ముంపు ప్రాంత ప్రజలు విలవిల
- వరద నీటితో ఇంట్లోనే తడిసి ముద్దయిన వస్తు సామగ్రి
- వరద తగ్గడంతో బురదతో నిండిపోయిన ఇళ్లు
- ఇంటికొచ్చి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కాలనీవాసులు
- తాగునీరు దొరకక, ఆహారం అందక నానా అవస్థలు
- ప్రభుత్వం తరపున అందని సహాయ సహకారాలు



ఖమ్మంలో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు, బీఆర్‌ఎస్ నేతలు

# మున్నేరు ముంచింది కన్నీరు మిగిలింది



ఖమ్మం కాల్వొడ్డులోని కాలనీలో వరదతో తడిసి ముద్దయిన సామగ్రిని ఇంటి ముందు పెట్టిన కుటుంబ సభ్యులు



మంచికంటి నగర్‌లో సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న కుటుంబ సభ్యులు

ఖమ్మం, సెప్టెంబర్ 2 : భారీ వర్షానికి తోడు ఎగువ నుంచి వచ్చే వరదతో మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. కనీవినీ ఎరుగని రీతిలో నగరంలో జలప్రళయం సృష్టించింది. పాలకుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో బడుగు జీవులను బజారున పడేసింది. పోటెత్తిన వరద ముంపు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. ఒక్కసారిగా వచ్చిన భారీ వరదతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న కాలనీ వాసులు, తల్లులు చంటి పిల్లలను చంకలో వేసుకుని బతుకు జీవుడా అంటూ పరుగులు పెట్టారు. విలువైన వస్తువులు, సామగ్రిని వదిలి కట్టుబట్టలతో ఇళ్లు వదిలి పారిపోయారు. ప్రతి ఒక్కరిని కదిలించే ఈ ఘటన ఖమ్మం నగరంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు చోటు చేసుకుంది. వర్షం వదిలి 24 గంటలు దాటినా పాలకులు, జిల్లా యంత్రాంగం వారికి తినడానికి తిండి, తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా అందించలేదు. అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహాయం తప్ప ఇతరత్రా ఎలాంటి సహాయానికి ముంపు బాధితులు నోచుకోలేదు.

### అంతా పేద, మధ్యతరగతి వారే..

మున్నేరు నది పరీవాహక ప్రాంతాలైన నగరంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వర నగర్, మాణిక్య నగర్, గణేశ్ నగర్, మోతీ నగర్, మంచికంటి నగర్, దానవాయి గూడెం కాలనీ, ధంసలాపురం కాలనీలు దాదాపు ఆరు డివిజన్లు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో అత్యధికంగా నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలే ఎక్కువ జీవిస్తుంటారు. ఎక్కువగా చిరు వ్యాపారులు, కూరగాయల, వ్యవసాయ మార్కెట్, గాంధీచౌక్ ఏరియాల్లో హమాలీలుగా, దుకాణాల్లో గుమస్తాలుగా, పండ్ల దుకాణాల్లో కూలీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటారు. రోజువారీగా నాలుగు చక్రాల బండ్లపై పల్లీలు, మొక్కజొన్న కంకులు, పండ్లు, కూరగాయలు విక్రయిస్తుంటారు. వీరితోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు జీవిస్తుంటారు. అయితే మున్నేరు వరద వారి జీవితాలను అతలాకుతలం చేసింది. ప్రతి ఇంటిని వరద ముంచెత్తింది. కొన్నిచోట్ల రెండంతస్తుల ఇళ్లు కూడా వరదతో నిండిపోయాయి. చేసేది లేక ఇళ్లు వదిలి బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి తలదాచుకున్నారు. ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో కొందరు తలదాచుకున్నారే తప్ప మెజార్టీ ప్రజలు వారి బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఇలాంటి దుర్భర పరిస్థితులను తమ జీవితంలో ఇంతవరకు చూడలేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. అయితే ప్రాణాలు దక్కించుకున్న ఆ ప్రాంత ప్రజలు సోమవారం ఉదయం కన్నీటితో వారి ఇళ్లకు చేరుకున్నారు.

### కన్నీటి పర్యంతమవుతున్న బాధితులు

ముంపు ప్రాంతాల్లో ఒక్కొక్కరిది ఒక్కో దీన గాథ. వర్షం, వరద ఉధృతి తగ్గడంతో ఇళ్లకు చేరుకున్న వారు బురదతో నిండిపోయిన ఇంటిని చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. విలువైన టీవీలు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, మంచాలు, పరుపులు, ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, బీరువాలు, టేబుళ్లు, ఫ్యాన్లు, కుర్చీలు, గ్యాస్ పొయ్యిలు, సర్టిఫికెట్లు, ఫోన్లు, వాచీలు, పుస్తకాలు, వంట సామగ్రి, నిల్వ పచ్చళ్లు, డబ్బులు, బంగారు నగలు, విలువైన దుస్తులు మొత్తం వరదలో కొట్టుకుపోగా.. మరికొన్ని ఇంట్లోనే బురదలో కూరుకుపోయాయి. కట్టుబట్టలతో బయటకు రావడంతో ప్రస్తుతం కట్టుకోవడానికి దుస్తులు లేక బంధువుల ఇళ్ల నుంచి తెప్పించుకుంటున్నారు.

**కేసీఆరే మా దేవుడు..**

పోయిన ఏడాది వరదలు వచ్చినప్పుడు సీఎం కేసీఆర్ సీఎంగా ఉన్నారు. ఆయనే మా దేవుడు. ఆయన వెంటనే పువ్వాడ అజయ్‌కుమార్‌ను పంపి మాకు అండగా ఉంచారు. ఎలాంటి ప్రాణ నష్టం కాదు కదా.. కనీసం ఆస్తి నష్టం జరగలేదు. వరదలు వస్తాయని ముందే చెప్పడం ద్వారా మా ఆస్తులను కాపాడుకునే వాళ్లం. గత ఏడాది ముందు సమాచారం ఇవ్వడం వల్ల మా సరుకులు, వస్తువులను ట్రాక్టర్లలో తీసుకెళ్లి నయాబజార్ కళాశాలలో ఉంచాం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. వరధలు వస్తాయని ఏ ఒక్కడు చెప్పకపోవడం వల్లనే మాకు ఇంత నష్టం జరిగింది. దీనిని ఎవరు భరించాలి?

**–నాళం విజయలక్ష్మి, ఖమ్మం**



### లక్షల్లో ఆస్తి నష్టం..

మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో పలువురి వాహనాలు నీటిలో మునిగిపోయాయి. వీటిలో బైక్‌లు, ఆటోలు, కార్లు, ట్రాలీ ఆటోలు, తోపుడు బండ్లు ఉండగా.. ఇదే ప్రాంతంలో లారీల కార్యాలయం కూడా ఉంది. ఇక్కడ లారీలు నిలిచి ఉండడంతో అవి కూడా నీటిలో మునిగిపోయాయి. వరదతో తడిచిపోయి స్టార్ట్ కావడం లేదు. కిరాణా దుకాణాల్లోని సరుకులు, మెడికల్ షాపుల్లోని మందులు, ఆయిల్ క్యాన్లు, మోటర్లు మొత్తం పాడైపోయాయి. దీంతో కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. మున్నేరు వరద తగ్గిపోయినా బురద మాత్రం ఆ ప్రాంతంలో మోకాలి లోతులో ఉంది. రోడ్లు, ఇళ్లు బురదతో నిండిపోయాయి. ఇంట్లో పాడైన వస్తువులను ఇంటి ముందు పెట్టుకొని బోరున విలపిస్తున్నారు. ఇళ్లలోని బురదను శుభ్రం చేసుకోవడానికి కూడా నీళ్లు లేని దుస్థితి. తినడానికి తిండి లేదు. తాగడానికి కనీసం నీళ్లు కూడా లేవు. ఉదయం నుంచి రాత్రి వరకు పస్తులతోనే గడిపారు. చిన్నపిల్లలను బంధువుల ఇళ్లలో ఉంచి పెద్దవాళ్లు మాత్రమే ఇంటిని శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

### ముందస్తు సమాచారం లేకనే నష్టం

మున్నేరుకు వరద రావడం కొత్తేమీ కాదు. గత ఏడాది కూడా మున్నేరు నది 32 అడుగుల మేర ప్రవహించింది. అయితే అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం వల్లనే భారీ ఆస్తి నష్టం జరిగింది. ప్రతి ఇంటికి సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అదే ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే అప్రమత్తమై ఇంట్లోని వస్తువులను కాపాడుకునేవారు. అధికారుల నిర్లక్ష్యంతోనే భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రజలు భావిస్తున్నారు. తమ ప్రాంతాలకు వస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులపై ముంపు ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఏ ముఖం పెట్టుకొని వస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఏ నాయకుడు అండగా లేడు..



భారీ వర్షం కురిసి ఇబ్బందుల్లో ఉన్నా ఇంతవరకు ఒక అధికారిగానీ, మంత్రిగానీ మా వైపు చూడలేదు. మేము తిన్నామా, చచ్చమా అని కూడా పట్టించుకోలేదు. ప్రజలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే నాయకుడు. అంతా అయిపోయాక వచ్చి ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప ఏమీ లేదు. ఇకనైనా పాలకులకు బుద్ధి రావాలి.

**–పార్వతి, ఖమ్మం కాల్వొడ్డు**

### రెండు రోజులుగా పస్తులే..



రెండు రోజుల నుంచి తిండి లేదు. తాగడానికి నీళ్లు లేవు. వరద వచ్చి ఇల్లు, వాకిలి వదిలిపెట్టి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగులు పెట్టాం. ఇప్పుడు ఇంటికి వచ్చి చూస్తే కన్నీళ్లు తప్ప మిగిలేది మిగిలింది ఏమీ లేదు. రెండు రోజుల నుంచి ఆకలితో అలమటిస్తున్నాం తిండి పెట్టేవాడు లేడు.. నీళ్లు ఇచ్చేవాడు లేడు. చీకట్లో మగ్గుతున్నాం

**–అంగోతు సత్తెమ్మ, ఖమ్మం కాల్వొడ్డు**

### మమ్ముల్ని కాపాడేది ఎవరు?



ఖమ్మం ఎమ్మెల్యేగా అజయ్‌కుమార్ ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు. పోయిన సంవత్సరం వరదలు వస్తే మా తోటే ఆయన ఉండి మాతోటే తిన్నాడు. నాయకుడు అంటే అలా ఉండాలి. ఇప్పుడు మమ్ముల్ని పట్టించుకునే వాడే లేడు. రాత్రిపూట వరద వస్తుందని మాకు చెప్పినట్లయితే మా ఆస్తులను పోగొట్టుకునే వాళ్లం కాదు. అధికారులు కానీ, నాయకులు కానీ ప్రజలకు మంచి చేయాలి తప్ప నష్టం జరిగాక వచ్చి ఫొటోలుకు ఫోజులు ఇవ్వడం ఇవ్వడం వల్ల మాకు ఏమీ ఉపయోగం ఉండదు. ఇప్పుడు మమ్ముల్ని కాపాడేది ఎవరు. **–జ్యోతి, చంటి పాప తల్లి, ఖమ్మం**

### ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేదు



జిల్లాలో ముగ్గురు మంత్రులు పేరుకే ఉన్నారు. కానీ వారి వల్ల మాకు ఎలాంటి ఉపయోగం లేదు. వరదలు వస్తాయని ముందే అధికారులు వారికి చెప్పలేదా? చెబితే వాళ్లు మమ్ముల్ని ఎందుకు పట్టించుకోలేదు? వాళ్ల బంధువులో, వాళ్ల కుటుంబ సభ్యులో ఉంటే ఇలాగే చేస్తారా? చెప్పండి. ఓట్లప్పుడు నీతి మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని ప్రజలకు కష్టాలు రాగానే కనబడకుండా పోయేవాళ్లని అనవసరంగా ఎన్నుకున్నాం. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి మా బతుకుల్ని మేమే పాడు చేసుకున్నాం. ప్రజలతో ఉండి ప్రజల కోసం కష్టపడే వాళ్లని ఎన్నుకోకపోవడం వల్లనే మాకే నష్టం జరిగింది. **– నసీమా, వెంకటేశ్వర నగర్**

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కూసుమంచి పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సాగర్ ఎడమ కాలువ గండిని పరిశీలించిన సీఎం
- పాలేరు వరద పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి



పాలేరు ప్రధాన కాలువకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి

కూసుమంచి, సెప్టెంబర్ 2: భారీ వర్షాలతో జరిగిన నష్టంపై అంచనాలు రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే అన్ని శాఖల అధికారులు కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాణనష్టం జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు, వరదల ప్రభావం పాలేరు నియోజకవర్గంలో అధికంగా ఉన్నందున సోమవారం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి.. మండలంలోని పలు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. సాగర్ ఎడమ కాలువ రెండో జోన్ సమీపంలో హట్యాతండా వద్ద పడిన గండిని పరిశీలించారు. వరద పరిస్థితి, కాలువ గండి వివరాలను సీఈ విద్యాసాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. సూర్యాపేట – ఖమ్మం హైవేపై ఆదివారం రాకపోకలు బంద్ అయిన ప్రదేశాన్ని, అక్కడే కూలిన బ్రిడ్జిని సీఎం పరిశీలించారు. వీటి గురించి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో చర్చించారు. అనంతరం పాలేరు ప్రధాన కాలువ వద్దకు చేరుకొని గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. నష్ట తీవ్రత గురించి సీఈని అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు. ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు సంజీవ్, మురళి, ఎస్సై నాగరాజు బందోబస్తు నిర్వహించారు.

## ఆపదలో ఆదుకోని ప్రజా పాలన ఎందుకు?

**భారీ వర్షాలతో అతలాకుతలమైనా పట్టించుకోరా?**

**బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా**



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 2 : ప్రజలను ఆపద సమయంలో ఆదుకోని ప్రజా పాలన ఎందుకని? భారీ వర్షాలతో నియోజకవర్గం అతలాకుతలమైనా పట్టించుకోరా? అని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రశ్నించారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముగ్గురు మంత్రులు, 9 మంది ఎమ్మెల్యేలను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఇస్తే.. విపత్తుల సమయంలో వారు తుపాకీ గుండుకి కూడా దొరకడం లేదంటూ ఎద్దేవా చేశారు. వరదల సమయంలో ప్రజలకు సహాయం చేయకపోగా మనోధైర్యం ఇచ్చిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం నగర పరిస్థితి ఇంకా దారుణంగా ఉందన్నారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, సర్వం కోల్పోయిన కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే మొద్దు నిద్రలో ఉన్నాడా? ఇంత జరుగుతుంటే ఎక్కడా సహాయం చేసిన దాఖలాలు కనిపించలేదన్నారు. రైతులకు జరిగిన పంట నష్టంపై అంచనా వేసి తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ పోశం నర్సింహారావు, ముత్యంబాబు, కుర్రి నాగేశ్వరరావు, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీను, కుంట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు అడుగడుగునా అడ్డంకులు

- 'రూ.పది వేలు వద్దు.. మీరు వద్దు..' అంటూ నినాదాలు
- తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఖమ్మం గృహకల్ప కాలనీ వాసులు



'మీరు ఇచ్చే రూ.పది వేలకు ఒక్క సామాను కూడా రాదు.. మీ రూ.పది వేలు వద్దు.. మీరు వద్దు..' అంటూ సీఎంకు వ్యతిరేకంగా చేతులు ఎత్తి నినాదాలు చేస్తున్న ఖమ్మం రూరల్ మండలం రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు

ఖమ్మం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డికి, పలువురు మంత్రులకు చేదు అనుభవం ఎదురైంది. మండలంలోని పోలేపల్లి రాజీవ్ గృహకల్ప కాలనీలో సీఎం పర్యటిస్తున్న సమయంలో స్థానికులు అడుగడుగునా అడ్డుతగిలారు. సోమవారం సాయంత్రం కాలనీలో సీఎం పర్యటన ఉంటుందని సరిగ్గా రెండుగంటల ముందుగా అధికారికంగా షెడ్యూల్ విడుదలైంది. సాయంత్రం 4:30 గంటలకు రావాల్సిన సీఎం, మంత్రులు.. 5:30 గంటలకు కరుణగిరి ఏరియాకు వచ్చారు. అయితే ఉదయం 8 గంటల సమయంలో అదే ప్రాంతంలో సుమారు రెండు గంటలపాటు కాలనీవాసులు రాస్తారోకో చేశారు. ప్రభుత్వం పట్టించుకోవాలని, మంత్రి పొంగులేటి తమ కాలనీని పరిశీలించాలని డిమాండ్ చేస్తూ వారు ఆందోళన చేసిన నేపథ్యంలో.. పోలీసులు అప్రమత్తమయ్యారు. కాలినడక కాకుండా ఓపెన్‌టాప్ జీప్‌ను ఏర్పాటు చేశారు. సరిగ్గా సీఎం వచ్చే గంట ముందుగా అధికారులు వచ్చి జేసీబీలను తీసుకొచ్చి పారిశుధ్య పనులు చేపట్టారు. కాలనీవాసులకు తాగు నీరు, ఆహార పొట్లాలు తీసుకొచ్చారు. అయితే, కాలి నడకన ఇంటింటి పర్యటనకు సీఎం వస్తారని ఆశించిన కాలనీవాసులకు.. ఓపెన్‌టాప్ జీప్‌పై సీఎం కన్పించి అభివాదం చేశారు. దీంతో ఆగ్రహించిన కాలనీవాసులు.. నిరసన తెలిపారు. జీప్ దిగివచ్చి తమ ఇబ్బందులను చూడాలంటూ నినాదాలు చేశారు. కాగా, కాలనీలో దాదాపు 15 నిమిషాలపాటు జీప్‌పై ఉన్న సీఎం.. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడాన్ని గమనిచారు. అలాగే, కాలనీ సెంటర్‌కు వచ్చిన ఆయన.. అక్కడ జీప్ ఆపారు. పక్కనే ఉన్న మూతి సంతోశ్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లారు. అలా వెళ్లి ఇంటి పరిసరాలను చూసి ఇలా తిరిగి వచ్చి జీప్ ఎక్కబోయారు. ఆ సమయంలో ఓ వ్యక్తి సీఎం జీప్ అడ్డంగా వచ్చి కింద పడుకునే ప్రయత్నం చేశారు. ఈలోపే సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. అనంతరం అదే సెంటర్‌లో కాలనీవాసులను ఉద్దేశించి తొలుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతారని మంత్రి చెప్పినప్పటికీ.. స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో నేరుగా ముఖ్యమంత్రే మైక్ తీసుకొని మాట్లాడారు. సీఎం ప్రసంగం ఆరంభం మొదలుకాగానే.. దూరంగా ఉన్న కాలనీవాసులు నినాదాలు చేశారు. 'ప్రచారం వద్దు.. సాయం చేయండి..' అంటూ నినదించారు. 'ఇంటికి రూ.పది వేల పరిహారం ఇస్తాం..' అని చెప్పే సమయంలో అన్ని వైపుల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'మీరు ఇచ్చే రూ.పది వేలకు ఒక్క సామాను కూడా రాదు.. మీ రూ.పది వేలు వద్దు.. మీరు వద్దు..' అంటూ చేతులు ఎత్తి నినాదాలు చేశారు. కాగా, సీఎం కాన్వాయి వెళ్లిన తరువాత కూడా కాలనీవాసులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కాలనీకి వచ్చిన కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దీంతో వారు కూడా నిమిషాల వ్యవధిలోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు.